క్లుప్తంగా

కలెక్టర్‌కు చాంబర్ ప్రతినిధుల సత్కారం



కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న చాంబర్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రావిరాల మహేష్‌కుమార్‌ను ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపార సంఘాల ప్రతినిధులు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు కలిసి కలెక్టర్‌ను సత్కరించారు. చాంబర్ కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, ముఖ్య సలహాదారు నల్లా పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు మోకా వెంకట సుబ్బారావు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, వివిధ వ్యాపార సంఘాల ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, వలవల శివరావు, రాయుడు నాని, అనుపోజు శ్రీను, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి తదితరులు కొత్త కలెక్టర్‌ను సత్కరించిన వారిలో ఉన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ కూడా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన సర్పంచ్‌లు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న సర్పంచ్‌లు

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రావివాల మహేష్‌కుమార్‌ను పలువురు సర్పంచ్‌లు శుక్రవారం కలుసుకున్నారు. ఏపీ సర్పంచ్‌ల సమాఖ్య కార్యవర్గ సభ్యురాలు, బండారులంక సర్పంచ్ పెనుమల సునీత, రెడ్డిపల్లి, తాండవపల్లి సర్పంచ్‌లు కరాటం ప్రసన్న, గంగుమళ్ల ఏసుబాబు, వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహర్, కరస్పాండెంట్ కె.నరసింహరావు తదితరులు కలెక్టర్‌ను సత్కరించారు.

దుమ్ము లేపుతున్న దమ్ము ట్రాక్టర్లు



కూనవరంలో రోడ్డుపై తిరుగుతున్న ట్రాక్టర్

ఉప్పలగుప్తం: ఖరీఫ్ వరి సాగు నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్లపై దమ్ము ట్రాక్టర్లు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీనితో కోట్లాది రూపాయల ప్రజా ధనంతో నిర్మిస్తున్న రోడ్లు ఛిద్రమవుతున్నాయ ని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పెద్ద ఇనుప చ క్రాలతో దమ్ము ట్రాక్టర్లు తిరుగుతున్నా, స్థానికంగా ఉన్న పంచాయతీ, ఆర్అండ్‌బీ, పంచాయ తీరాజ్ అధికారులు పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు పా డవకుండా చర్యలు తీసుకోవాలనికోరుతున్నారు.

పెట్రోల్ బంకులో అగ్ని ప్రమాదం

యానాం: యానాం బైపాస్ రహదారిలో ఉన్న ఇండియన్ ఆయిల్ బంకులో శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. పెట్రోల్ బంకు అండర్ గ్రౌండ్‌లో పైపులైన్లు మార్చుతున్న క్రమంలో మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తున్న వ్యక్తి అక్కడే ఉండిపోయాడు. సిబ్బంది స్పందించి ఫోమ్‌తో మంటలను అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న యానాం అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్సై మురుగానందన్ ఘటనా స్థలాన్ని సందర్శించారు.

ఒట్టు.. గట్టు మీదేనా!?



పి.మల్లవరం గ్రామంలో వేసిన వరి నారుమడి



పోలేకుర్రు గ్రామంలో వరి చేను దమ్ము చేస్తున్న రైతు

- ముమ్మరంగా సాగుతున్న వ్యవసాయ పనులు
- నేటికీ అందని పెట్టుబడి సాయం
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ప్రభుత్వం హామీ
- ఇప్పటి వరకూ వెలువడని ప్రకటన
- రాష్ట్ర ప్రభుత్వ చేయూతపై అన్నదాతల ఆశలు

తాళ్లరేవు: కొద్ది రోజులుగా అడపాదడపా వర్షాలు పడుతుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ముమ్మరంగా రైతులు వరి సాగును చేపట్టారు. సుమారు 30 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలి విడత సాయాన్ని విడుదల చేసింది. గత నెల 18న రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున నగదు జమ చేసింది. ఇది విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు కొంత మేర ఉపయోగపడింది. రాష్ట్ర ప్రభుత్వ సాయం ఇంకా విడుదల కాకపోవడంతో అన్నదాతలు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

రైతుకు అండగా భరోసా!

పంట సాగుకు రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించింది. పీఎం కిసాన్ సాయంగా రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 వెరసి ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమయ్యేది. ఈ మొత్తం మూడు విడతల్లో రైతులకు అందేది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు, అటవీ, దేవదాయ భూములు సాగు చేస్తున్న వారికి కూడా పెట్టుబడి సాయంగా గత ప్రబుత్వం అందించింది. కొత్త రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో రైతుల్లో సర్వత్రా ఆందోళన నెలకొంది.

సాయం కోసం ఎదురుచూపు

ముమ్మిడివరం నియోజకవర్గంలో 34 వేల ఎకరాల్లో వరిపంట సాగు చేస్తుండగా, సుమారు 25 వేల మందికిపైగా రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండడంతో తొలకరి పంట పనులు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే రైతులు వరి నారుమడులు వేసి, దమ్ములు చేయడం మొదలెట్టారు. సాగు ప్రారంభంలో దుక్కులు దున్నడం, విత్తనాల కొనుగోలు, నారుమడుల తయారీ, నాట్లు వేసేందుకు, ఎరువులు కొనుగోలుకు పెట్టుబడి సాయం అవసరం. ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సాయం రైతులకు ఎంతగానో తోడ్పడింది. పెట్టుబడి సాయం కింద రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని కూటమి పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడంతో, అన్నదాతలు ఎంతగానో ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో దీని ఊసెత్తకపోవడం, ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో అన్నదాతలు పెదవి విరుస్తున్నారు.

సకాలంలో ఇస్తే మంచిది



ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం సాగు ప్రారంభంలో ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సాగు ప్రారంభంలో దుక్కులు దున్నడం, దమ్ములు చేయడం, విత్తనాలు, ఎరువుల కొనుగోలు ఇలా అనేక ఖర్చులు ఉంటాయి. పెట్టుబడి సాయం సాగు ప్రారంభంలోనే ఇస్తే మాకు కొంత ఊరటగా ఉంటుంది.

– పాలెపు ఈశ్వరరావు, కౌలు రైతు, పోలేకుర్రు గ్రామ పంచాయతీ

అన్ని విధాలా ఆదుకోవాలి



ప్రస్తుతం వ్యవసాయం అనేక ఒడిదుడుకుల మధ్య భారంగా మారింది. వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, పంట నష్టాలతో అప్పులు పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం సాగు ప్రారంభంలో ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– చల్లా సంతోష్‌కుమార్, మండల కార్యదర్శి, ఏపీ కౌలు రైతు సంఘం, తాళ్లరేవు మండలం

8న వైఎస్సార్ జయంతి వేడుకలు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఈ నెల 8వ తేదీ ఉదయం స్థానిక హైస్కూలు రోడ్డులో జరుగుతాయని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. అదే సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించి, కేక్ కట్ చేస్తారని వివరించారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థలకు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బులినాని కోరారు.

పెంపుడు జంతువులకు నేడు వ్యాక్సినేషన్

తాళ్లరేవు: వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా ఈ నెల 6వ తేదీ శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పశు వైద్యాధికారి దవులూరి సుధ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న పశు వైద్య కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జంతువుల లాలాజలం, తాకిడి, విసర్జకాల ద్వారా అనేక వ్యాధులు మనుషులకు సంక్రమించే అవకాశం ఉందన్నారు. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడమే వరల్డ్ జునోసిస్ డే ప్రధాన లక్ష్యమన్నారు. పెంపుడు జంతువులతో పాటు, ఇతర జంతువులకు సైతం ఉచితంగా వ్యాక్సిన్లు వేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

రూ.20.50 లక్షల విడుదల

యానాం: గతేడాది యానాం–తాళ్లరేవు జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు సీఎం సహాయనిధి నుంచి రూ.20.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. గతేడాది మే 14న తాళ్లరేవు బైపాస్ సుబ్బారాయుని దిమ్మ ప్రాంతంలో ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న రొయ్యల ఫ్యాక్టరీకి పనికి వెళ్లిన 8 మంది మహిళలు మృతిచెందగా, ఓ మహిళ ఇప్పటికీ అపస్మారక స్థితిలోనే ఉంది. వీరితో పాటు, మరో ఐదుగురు ఆ సంఘటనలో గాయపడ్డారు. ఈ నేపథ్యంలో పుదుచ్చేరి ప్రభుత్వం రూ.లక్ష వంతున పరిహారం ప్రకటించగా, తన చొరవతో మరో రూ.2 లక్షలు మంజూరయ్యాయని, క్షతగాత్రులకు రూ.50 వేలను సీఎం రంగసామి అందజేశారని మల్లాడి తెలిపారు. ఈ నగదు చెక్కును యానాం వచ్చి బాధిత కుటుంబాలకు అందజేస్తానన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

ముమ్మిడివరం: జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శుక్రవారం ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. కాకినాడ బీచ్‌కు వెళ్లిన ఐదుగురు విద్యార్థులు మంగళగిరికి తిరిగి వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో స్వల్ప గాయాలతో అందరూ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. రోడ్డుపై అడ్డొచ్చిన కుక్కను తప్పించబోయే తరుణంలో అదుపుతప్పిన కారు పక్కనున్న పొలాల్లోకి బోల్తా పడింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అధ్యాపక పోస్టులకు ముగ్గురి ఎంపిక

యానాం: పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మార్కుల ఆధారంగా యానాం నుంచి ఇద్దరిని అధ్యాపక పోస్టులకు ఎంపిక చేసినట్టు విద్యా శాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓబీసీ కేటగిరి నుంచి ఫిజిక్స్ పోస్టుకు మట్టా లలిత, జనరల్ కేటగిరి నుంచి హిందీ సబ్జెక్టుకు హాజరాబాను మహ్మద్, ఓబీసీ కేటగిరి నుంచి హిస్టరీ పోస్టుకు రాయుడు ప్రసన్నకుమారి ఎంపికయ్యారని చెప్పారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి.ప్రియదర్శిని ఆదేశాలు జారీ చేశారన్నారు.

అతిసారంపై అవగాహనా ర్యాలీ

యానాం: వర్షాల సీజన్ ప్రారంభం కావడంతో అతిసారం ప్రబలే అవకాశాలున్నాయని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. ముఖ్యంగా చిన్నారులను ఈ వ్యాధి నుంచి రక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ఏఓ కార్యాలయం వద్ద నుంచి డయేరియా వ్యాధిపై చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అతిసార బారిన పడకుండా వైద్యులు చెబుతున్న రక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, జీజీహెచ్ డీడీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల ర్యాలీ



పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: పచ్చదనం, పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ విద్యార్థులు పట్టణంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక గొల్లగూడెం ఆదిత్య పాఠశాల ప్రిన్సిపాల్ కుంపట్ల లక్ష్మీదేవి ర్యాలీని ప్రారంభించారు. గొల్లగూడెం, హైస్కూలు రోడ్డు, గడియారం స్తంభం సెంటరు మీదుగా ర్యాలీ కొనసాగింది. సేవ్ ట్రీ, సేవ్ లైఫ్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. పర్యావరణ పరిరక్షణకు పచ్చదనానికి ఎంతో ప్రాధాన్యముందని విద్యార్థులు వివరించారు. గ్లోబల్ వార్మింగ్‌పై పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పచ్చని మొక్కల చిత్రాలతో ఉన్న ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. ర్యాలీలో పాల్గొన్న పట్టణ ఏఎస్సై ఆర్.సత్యనారాయణ, ఇతరులకు విద్యార్థులు పూల కుండీలు అందించారు.

జునోసిస్ డే సందర్భంగా నేడు అవగాహన సదస్సు

అమలాపురం టౌన్: ప్రపంచ జంతు సంక్రమిత వ్యాధుల దినం సందర్భంగా స్థానిక నల్ల వంతెన సమీపంలోని ఏరియా పశువుల ఆస్పత్రి వద్ద శనివారం ఉదయం పది గంటలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ ర్యాబిస్ టీకాలు వేయనున్నట్టు వెల్లడించారు. పెంపుడు కుక్కలతో పాటు, ఎవరైనా వీధి కుక్కలను తీసుకువచ్చినా టీకాలు వేస్తామన్నారు. ఈ సదస్సుకు జంతు ప్రేమికులు, జంతువుల యజమానులు హాజరు కావాలని కోరారు.

స్కూల్ నిర్వహణపై డీవైఈఓకు ఫిర్యాదు



డీవైఈఓకు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తాళ్లరేవు: జి.వేమవరంలో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని, ఆ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు కాకినాడ డీవైఈఓ వెంకటేశ్వర్లుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సీబీఎస్ఈ స్కూల్ కోడ్‌తో ఆ స్కూలు నిర్వాహకులు అనుమతి పొంది, కాన్సెప్ట్ స్కూల్‌గా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కాన్సెప్ట్ స్కూల్‌కు అనుమతి లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కూలు పేరు మార్చి, బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. ఆ స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఎం.గంగా సూరిబాబు, పి.వాసుదేవ్, సంజయ్, రాజేష్, జయరామ్, విప్పిన్‌కుమార్ తదితరులు డిమాండ్ చేశారు. దీనిపై చర్యలు తీసుకుంటామని డీవైఈఓ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించాలి

తాళ్లరేవు/యానాం: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయడాన్ని నియంత్రించాలని విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎల్‌కేజీ నుంచి టెన్త్ వరకు విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేయడమే కాక, పుస్తకాలు, యూనిఫారాలు, విద్యా సామగ్రిని సైతం తమ వద్దే కొనాలని నిబంధనలు పెట్టడం దారుణమన్నారు. మధ్య తరగతి ప్రజలు అటు ప్రభుత్వ పాఠశాలలకు, ఇటు ప్రైవేటు విద్యా సంస్థలకు తమ పిల్లలను పంపలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పలు పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా ఉండడం లేదని చెప్పారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణాలు కూడా లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. విద్యా శాఖ అధికారులు ఆయా సమస్యలపై దృష్టి సారించి, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



కొత్తలంకలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ముమ్మిడివరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.రాజ్‌కుమార్ అన్నారు. కొత్తలంక పీహెచ్‌సీ పరిధిలోని కొత్తలంక గ్రామంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. మలేరియా వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు భుజించరాదన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాసులు, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో అత్యవసర మందులు

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: అత్యవసర మందులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఆర్ఏఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాల సీజన్ కావడంతో అతిసార ప్రబలే అవకాశాలు ఉంటాయన్నారు. అందువల్ల ముందస్తుగా ఎక్కువ మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆస్పత్రిలో ఉన్న లిఫ్ట్ పనిచేయక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం లిఫ్ట్ మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆపరేషన్ థియేటర్‌లో కనీస సదుపాయాలు కల్పించి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అదేవిధంగా ఐసీయూ విభాగంలో ఆక్సిజన్ పైపులైన్ల ఏర్పాటు, ఓపీడీ విభాగంలో విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు, నూతనంగా జనరేటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆక్సిజన్ ప్లాంటు పునరుద్ధరణ, సురక్షిత మంచినీటి ప్లాంట్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జీజీహెచ్ డీడీ టి.రవిశంకర్, ఏడీ పాలాష్‌కుమార్ సన్యాల్, పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్, జేఈలు నాగరాజు, భాస్కర్, ప్రసాద్, విద్యుత్ ఏఈ మూర్తి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ, సోషల్‌వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీను పాల్గొన్నారు.

కానరాని ముందస్తు ప్రణాళిక

- ముంచుకొస్తున్న వరదల సమయం
- ధవళేశ్వరంలో 28,283 క్యూసెక్కుల నీటి విడుదల
- నెలాఖరు నాటికి మరింత పెరిగే అవకాశం
- ఫ్లడ్ స్టోర్‌లను సిద్ధం చేసిన గత ప్రభుత్వం
- ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నెల కావొస్తున్నా చర్యలు నిల్!



కేదారిలంకలో ముంపు బారిన లంక గ్రామం (ఫైల్)



2023 జూలైలో కేదారిలంకలో వరద పరిస్థితులను పరిశీలిస్తున్న అప్పటి ఆర్డీఓ సింధు సుబ్రహ్మణ్యం

కపిలేశ్వరపురం: జూలై, ఆగస్టు నెలలు అనగానే వరద భయం ముంచుకొస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరిలో నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. దీంతో ధవళేశ్వరంలో 28,283 క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేశారు. ప్రస్తుతానికి అంత ప్రమాదం కాకపోయినా సహజంగానే జూలై నెలాఖరు నాటికి వరదల ప్రభావం తీవ్రమవుతుందన్నది గత అనుభవం. ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగేలోపే ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల కావస్తున్నా క్షేత్ర స్థాయిలో వరదలపై సరైన ఆదేశాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో జూన్‌లో ఫ్లడ్‌స్టోర్‌ల నిర్వహణపై క్షేత్ర స్థాయిలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇలాఉండగా ఇప్పటికే మిగులు జలాలు విడుదల చేయడంతో లంక గ్రామాల ప్రజల్లో అలజడి మొదలైంది.

వరద ప్రభావమిలా..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని పలు లంక గ్రామాలు పూర్తిగా గోదావరి నదిలో ఉన్నాయి. కపిలేశ్వరపురం మండలంలో అద్దంకివారిలంక, కేదారిలంక, కె.గంగవరం మండలంలో శేరిలంక మొత్తం మూడు గ్రామాలు ఏటా వరద ప్రభావానికి గురవుతాయి. అద్దంకివారిలంక గ్రామ పరిధిలో పల్లపులంక, అద్దంకివారిలంక, కోరుమిల్లి లంక, కేదారిలంక గ్రామ శివారులో వీధివారిలంక, కేదారిలంక, కపిలేశ్వరపురం గ్రామ పరిధిలో నారాయణలంకలు వరదల సమయంలో పెద్ద ఎత్తున నష్టపోతుంటాయి. ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగానే ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలకు వరదనీరు తాకుతుంది. రెండో ప్రమాద హెచ్చరిక రాగానే వ్యవసాయ క్షేత్రాలు మొత్తం ముంపుబారిన పడతాయి.

విశేషంగా సేవలందించిన వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నెలకొల్పిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు వరదల సమయంలో విశేషంగా ఉపకరించాయి. 2022, 2023ల్లో సంభవించిన వరదల్లో సచివాలయ ఉద్యోగులు లంక గ్రామాల్లోనే ఉంటూ బాధితులకు సేవలందించారు. రాత్రింబవళ్లు గోదావరి గట్లను పరిశీలిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలిచ్చారు. బాధిత ఇళ్లకు ఆహారాన్ని, కూరగాయలను పడవలపై తీసుకెళ్లి ఇచ్చేవారు. వలంటీర్లు ఇంటింటికీ వాటర్ కేన్లను అందజేసేవారు. ప్రస్తుత ప్రభుత్వ తీరు గత ప్రభుత్వం తెచ్చిన వ్యవస్థలను నిర్వీర్యం చేసేలా ఉందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో ప్రజాప్రయోజనాలను పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పశువులను గ్రామాలకు తరలించుకుంటారు. మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన పరిస్థితుల్లో గ్రామాల్లోని నివాసిత ప్రాంతాలు వరద నీటిలో తేలుతుంటాయి.

గత అనుభవాలిలా...

2014, 2016, 2018, 2019, 2020, 2022, 2023లలో వరుసగా వరదలకు లంక గ్రామాలు ముంపుబారిన పడుతూ వచ్చాయి. 2018 ఆగస్టు వరదలకు కపిలేశ్వరపురం, నారాయణలంక, కేదారిలంక, వీధివారిలంక గ్రామాల పరిధిలో 126.93 హెక్టార్లు, తాతపూడిలో 27.94 హెక్టార్లు, కోరుమిల్లి, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల పరిధిలో 54.72 హెక్టార్లు, మండలం మొత్తంలో 646 మంది రైతులకు చెందిన 209.59 హెక్టార్లలోని అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రూ.36,53,650 నష్టం వాటిల్లింది. 2019 ఆగస్టులో లంకల్లోని వ్యవసాయ క్షేత్రాలు, ఇటుక బట్టీలన్నీ ముంపుబారిన పడ్డాయి. తొగరపాట వంతెన మునగడంతో ఇతర గ్రామాలతో రాకపోకలు తెగిపోయాయి. వీరవల్లి పాలెం రహదారి మునిగిపోవడంతో ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరికి ఎడమ భాగాన ఉన్న తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, శ్రీరాంపురం, వాకతిప్ప గ్రామాల పరిధిలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 2023 జూలై వరదల సమయంలో వ్యవసాయ క్షేత్రాలు ముంపుబారిన పడగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాడి పశువులకు దాణాను సరఫరా చేసింది. పశు సంవర్ధక శాఖాధికారులను లంక గ్రామాల్లోనే ఉండేలా ఆదేశాలిచ్చి సేవలందించింది.